క్లుప్తంగా

బాల్యవివాహాలపై అవగాహన

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో ఆదివారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై కళాజాత కార్యక్రమం జరిగింది. నాగేశ్వరరావు కళాబృందంచే బాల్యవివాహాల నిర్మూలన, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు, విద్యాప్రమాణాలు, విద్య ప్రాముఖ్యత తదితర అంశాలను పాటల రూపంలో కళాజాత బృందం సభ్యులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కో–ఆర్డినేటర్ శిరీష, ప్రతినిధులు సుమలత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని వినతి



సజ్జల రామకృష్ణారెడ్డికి అర్జీ అందజేస్తున్న నిర్వాసితులు

ఏర్పేడు: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి విన్నవించారు. ఆదివారం తిరుపతిలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. 2012లో విమానాశ్రయ అభివృద్ధి పనులకు మండలంలోని వికృతమాల ఎస్సీ కాలనీకి చెందిన రైతుల భూములను ప్రభుత్వం సేకరించినట్లు వివరించారు. ఇప్పటివరకు నిర్వాసితులకు పరిహారం చెల్లించలేదన్నారు. సమస్యలపై అర్జీ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాసితులు గురునాథం, హరిప్రసాద్, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరుబాట వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి రూరల్: తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ శ్రీకాళహస్తి మండల కార్యదర్శి మించల శివకుమార్ పిలుపునిచ్చారు. ఆ మేరకు ఆదివారం మండలంలోని ముళ్లపూడి యానాది కాలనీలో సీపీఐ పోరుబాట వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ ధర్నాలో అంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నేతలతో పాటు రాష్ట్రస్థాయి నేతలు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో బత్తెమ్మ, విజయలక్ష్మి, వెంకటమ్మ సౌందర్య, వెంకటేష్, సుబ్బమ్మ, పోలయ్య పాల్గొన్నారు

గిరిజనుల అభివృద్ధికి చేయూత

ఏర్పేడు: గిరిజనుల అభివృద్ధికి దాతలు చేయూతనివ్వాలని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో గ్రామస్తులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నట్లు వివరించారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ మండల కో–ఆర్డినేటర్ చెంచురత్నమ్మ, వినోద్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

'సుకన్య సమృద్ధి' ఓ వరం



అవగాహన కల్పిస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్

శ్రీకాళహస్తి రూరల్: సుకన్య సమృద్ధి యోజన పథకం బాలికలకు ఓ వరంగా భావించాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మణిగండన్ అన్నారు. ఆదివారం ఆయన ఈ పథకాన్ని వలంటీర్లతో పాటు ఆశావర్కర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అమ్మఒడి లబ్ధిదారులకు శ్రీకాళహస్తి పోస్టల్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10 తేదీల్లో ప్రతి పోస్టాఫీస్‌లో సుకన్య సమృద్ధి పథకంలో చేరేందుకు ప్రత్యేకంగా ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే 10 ఏళ్ల లోపు బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి వారి తల్లిదండ్రులు కృషి చేయాల్సి ఉందన్నారు. బాలికలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముక్కంటి సేవలో రైల్వే అధికారి అశుతోష్



ఆలయ ధ్వజస్తంభం వద్ద రైల్వే అధికారి అశుతోష్ గంగల్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం నార్తన్ రైల్వే స్పెషల్ సెక్రటరీ అశుతోష్ గంగల్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

- అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం
- ప్రతిపక్షాలవి పిచ్చి ప్రేలాపనలు
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



కోలాటంతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



గుర్రపునాయుడు కండ్రిక గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని ఇలగనూరు సచివాలయం పరిధిలోని గాంధీసెంటర్, గుర్రపునాయుడు కండ్రిగ, హరిజనవాడ గ్రామంలో జోరుగా పర్యటించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులు, పెద్ద గజమాల వేసి, పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ప్రతి కుటుంబానికి నవరత్నాల ద్వారా అన్ని సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు..

ప్రతి కుటుంబానికి నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, మా కుటుంబం మీకు సేవకులుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందరికీ అందించడం జరుగుతుందన్నారు. సమస్య ఏదైనా ఉంటే పార్టీ కార్యాలయానికి నేరుగా రావచ్చన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు. గ్రామంలో కొంత మంది పింఛన్లు అందడం లేదని ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు వాసునాయుడు, మోహన్‌కిషోర్ నాయుడు, జెడ్పీటీసీ అర్చనాదేవి, మునిరత్నం, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, సర్పంచ్ బాలాజీనాయుడు, రమణయ్య నాయుడు, హరినాయుడు, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, ఎస్‌ఐ రాఘవేంద్ర, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నాగలాపురంలో గడపగడపకు..

పిచ్చాటూరు: నాగలాపురంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే నాగలాపురం వెస్ట్ హరిజనవాడకు చేరుకుని ప్రతి ఇంటికీ ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్ అందిస్తూ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం సాయంత్రం 3 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో జరగనున్న సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు గుర్రపునాయుడు కండ్రిగలో గడపగడపకు ..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలంలోని శివనాథపాళెం సచివాలయం పరిధిలోని దొంగలమూడురు, కారకొల్లు, హరిజనవాడ, తుమ్మలగుంట, శ్రీకృష్ణాపురం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ఎమ్మెల్యే కృషి చేస్తారని వివరించారు. కార్యక్రమానికి కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై గడపగడపకు మన ప్రభుత్వం విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

తప్పుల తడకగా స.హ.బోర్డు



రెవెన్యూ కార్యాలయంలో తప్పుల తడకగా ఉన్న సమాచార హక్కు చట్టం బోర్డులో పేర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సమాచార హక్కుచట్టం బోర్డులో అధికారుల పేర్లు తప్పుల తడకగా ఉన్నాయి. సమాచార హక్కుచట్టం బోర్డులోని పౌర సమాచార అధికారి, డిప్యూటీ తహసీల్దారు పేరు స్థానంలో ఆర్‌ఐ మాసారపు వెంకటసుబ్బయ్య పేరు ఉండగా, పర్యవేక్షకులు, మొదటి అప్పిలేట్ అధికారి పేరు ప్రస్తుత ఆర్‌డీఓ పేరు చంద్రమునిరణాల్ స్థానంలో సస్పెండ్ అయిన రోజ్‌మాండ్ పేర్లు ఉన్నాయి. పేర్ల సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సమాచార కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక తికమక పడుతున్నారు. సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు లేవని, ఇక సమాచార హక్కుచట్టం ఎలా అమలు అవుతుందో తెలియడం లేదని మండల ప్రజలు అంటున్నారు. సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. రెవెన్యూ కార్యాలయం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సమాచార హక్కు చట్టం బోర్డులో పేర్లు తప్పుల తడకగా ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు సరిగా రాయాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్



పేకాటరాయుళ్లను అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం సమీపంలోని గోపాలరావుకాలనీలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురు, వారి వద్ద ఉన్న రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీగా పేర్నాటిని గెలిపించండి



రేణిగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేణిగుంట: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. రేణిగుంట పట్టణం, తూకివాకం సచివాలయాల పరిధిలో ఆదివారం పట్టభద్రుల వద్దకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో పట్టభద్రులకు సచివాలయ ఉద్యోగాలు కల్పించారని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నారని, విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నారని ప్రచారం చేశారు. అలాగే నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాలయాల రూపురేఖలు మార్చి కార్పొరేట్ విద్యను అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ఎంపీటీసీ సుందరమూర్తి, ఇన్బనాథన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘపౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో మాఘ పౌర్ణమి పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను అందజేశారు. రథసప్తమి తర్వాత వచ్చే తొలి పౌర్ణమి కావడంతో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. స్థానిక సొరకాయల స్వామి ఆలయంలో శనివారం రాత్రి నిర్వహించిన హోమ పూజ, రథోత్సవం, ఊంజల్‌సేవలో తమిళనాడుకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం సొరకాయలస్వామికి అభిషేకాలను నిర్వహించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే కైలాసనాథకోనలోని కంచి, శివశక్తి ఆశ్రమాల్లో పౌర్ణమి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా పురుషుల పూజ



పరిపూర్ణానందగిరి స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



విశేష అలంకరణలో మళయాళస్వామి

ఏర్పేడు: మండల కేంద్రానికి సమీపంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన వ్యాసాశ్రమంలో 82వ అఖండ గురు పూజోత్సవాల్లో భాగంగా ఆదివారం పురుషుల పూజ ఘనంగా జరిగింది. వ్యాసాశ్రమ పీఠాధిపతి సద్గురు పరిపూర్ణానందగిరి స్వామి తమ కుటీరం నుంచి భజనలు, కోలాటాలతో అధిష్టాన మందిరానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం మందిరంలో వ్యాసాశ్రమ వ్యవస్థాపకుడు సద్గురు మళయాళస్వామి విగ్రహానికి పూజలు నిర్వహించారు. విద్యార్థినులు, పురుషులు, వేదపుంగవులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ స్వామివారి పాదుకలకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో శివరాం స్వామి, విమలానంద స్వామి, ఆశ్రమ కోశాధికారి మన్యం అమరనాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ ప్రత్యేకాధికారిగా రామారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీఓ రామారావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలకసంఘం ప్రత్యేకాధికారిగా కె.ఎస్.రామారావును ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను పురపాలకసంఘ కమిషనర్ బాలాజీనాయక్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, నారాయణరెడ్డి, రవికాంత్, బాలచంద్రయ్య, శ్రీనివాసులు, హుస్సేన్ అహ్మద్, దివ్యహాసిని తదితరులు పాల్గొన్నారు.

కందాడులో వారపు సంత ప్రారంభం



సంతను ప్రారంభిస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

ఏర్పేడు: వారపు సంతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కందాడులో వారపుసంత ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కందాడు పరిసర గ్రామాల రైతులు పండించిన వాటిని సంతలో అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీదేవి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు కందాటి ప్రభాకర్‌రెడ్డి, పరంధామరెడ్డి, నాగరాజు, రాంబత్తి యాదవ్, శేఖర్ రాజు, రాజేంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రమీళమ్మ

శ్రీకాళహస్తి: అపోలో సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి 91 జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి పట్టణంలో స్టెప్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆ పథక సంచాలకులు డాక్టర్ ప్రమీళమ్మ ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

సిద్ధులయ్యస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పిల్లారిగుడి వీధిలో కైలాసగిరిపై వెలసిన శ్రీసిద్ధులయ్యస్వామి 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. బీజేపీ నాయకులు కోలా ఆనంద్, గరికపాటి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి బ్రహ్మోత్సవ ఆహ్వానం



పళ్లికొండేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు మంత్రి పెద్దిరెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్

పిచ్చాటూరు: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ పాలకమండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆహ్వానించారు. ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం వద్ద మంత్రిని ఆలయ చైర్మన్, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, సభ్యులు, అర్చకులు కలిసి శివరాత్రి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో నాగలాపురం మండల పళ్లికొండేశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఎస్ఎం సురేష్, ఆనందుడు, మునివేలు, మంజుల, అజయ్‌కుమార్, చిత్ర, సత్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: అందరి సహకారంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆదివారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ముందుగా వాల్‌పోస్టర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకమండలిలో కలిసి అధికారులు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలన్నారు. అనంతరం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనలతో అందరి సమన్వయంతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓ సాగర్‌బాబు, ఆర్డీఓ రామారావు, పాలకమండలి సభ్యులు సాధన మున్నారాయల్, రమాప్రభ, సుమతి, సునీత, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు నీల, నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, గుమ్మడి బాలకృష్ణయ్య, పాలమంగళం రవి, నంద పాల్గొన్నారు.

వెల కట్టలేనిది గురుతర బాధ్యత



ఆనందబాబు దంపతులను సన్మానిస్తున్న బత్తల చెంచయ్య కుటుంబ సభ్యులు

నారాయణవనం: నాణ్యమైన రేపటి తరాన్ని తీర్చిదిద్దడంలో గురువుల బాధ్యతను విలువ కట్టలేమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక దిగువ పద్మశాలి వీధిలోని రాములవారి భజన మందిరంలో నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందబాబు దంపతులను అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయుడు బత్తల చెంచయ్య కుంటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ఆనందబాబు చదువుకున్న పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుడిగా పని చేయడం హర్షణీయమన్నారు. సొంత గ్రామంలో పిల్లల బంగారు భవిష్యత్ కోసం ఆయన ఎనలేని సేవలు అందిస్తున్నారని వారు కొనియాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసాపత్రం అందుకున్నట్లు ఆనందబాబు తెలిపారు. దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం, మునిబాబు, రమణి, ఉషారాణి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

15 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి

బంగారుపాళెం: మండలంలో దక్షిణకాశిగా పేరొంది స్వయంభుగా వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీమొగిలీశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మొగిలి గ్రామంలో ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 25 వరకు 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి మునిరాజ, వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్ ఆదివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 15న ఉదయం అంకురార్పణ, రాత్రి మూషిక వాహనం సేవ ఉంటుందన్నారు. 16న ఉదయం కలశస్థాపన, ధ్వజా రోహణం, రాత్రి హంసవాహనం, 17న ఉదయం అధికార నందివాహనం, రాత్రి సింహవాహన సేవ, అలాగే 18న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, రాత్రి లింగోద్భవ అభిషేకం, వృషభ వాహన సేవలు ఉంటాయని చెప్పారు. 19న ఉదయం కైలాసగిరి రావణబ్రహ్మ వాహన సేవ, రాత్రి శేషవాహనం, 20న ఉదయం అభిషేకం, గజవాహనం, రాత్రి కామధేను వాహనం, 21న ఉదయం అభిషేకం, సాయంత్రం కళ్యాణోత్సవం, రాత్రి అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిస్తారన్నారు. 22న ఉదయాత్పూర్వం తోపుఉత్సవం, అభిషేకం, మధ్యాహ్నం బ్రహ్మ రథోత్సవం, 23న ఉదయం అభిషేకం, రాత్రి పుష్పపల్లకి సేవ, 24న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజా అవరోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, శయనోత్సవం, 25వ తేదీ సాయంత్రం అభిషేకం, రాత్రి తెపోత్సవ కార్యక్రమాలను కనులవిందుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పరమశివుని బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

వాలీబాల్ టోర్నీ విజేత నరసింగాపురం జట్టు



విజేత జట్టుకు షీల్డు బహూకరిస్తున్న జూలియన్‌రాజు

రేణిగుంట: మండలంలోని జీవాగ్రం పీఎం హైస్కూల్ మైదానంలో ఆదివారం జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా నరసింగాపురం జట్టు నిలిచింది. చిత్తూరు నెహ్రూ యువజన కేంద్రం, ఆషా సంస్థ సంయుక్తంగా తొట్టంబేడు బ్లాక్ లెవల్ వాలీబాల్ పోటీల్లో మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. వాటిలో నరసింగాపురం–1, నరసింగాపురం–2 జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో నరసింగాపురం–1 జట్టు విజేతగా నిలిచింది. విన్నర్, రన్నర్ జట్లకు నిర్వాహకులు షీల్డులు, మెడల్స్, సర్టిఫికెట్లు, నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్‌రాజు, రిటైర్డ్ పీడీ డాక్టర్ సుధాకర్, ఆషా సంస్థ ముఖ్య సలహాదారు అమ్ములురాజు, శివకుమార్, శ్రీపతి, మ్యాచ్ రెఫరీ మధు, వలంటీర్లు నవతేజ, సాయికుమార్, విజయ, చామంతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణముఖిలో స్నానం ఆచరిస్తున్న భక్తులు



వైభవం.. త్రిశూల స్నానం..

వ్యాసపౌర్ణమను పురస్కరించుకుని మహాశివరాత్రికి ముందు స్వర్ణముఖ నదిలో నిర్వహించే త్రిశూల స్నానం ఘట్టం ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా త్రిశూలానికి ఆలయ అలంకార మండపంలో అర్చకులు పూజలు నిర్వహించి ఊరేగింపుగా స్వర్ణముఖ నది వద్ద ఉంచారు. అనంతరం త్రిశూలస్నానం ఘట్టాన్ని అశేష భక్తజనం నడుమ వైభవంగా నిర్వహించారు. – శ్రీకాళహస్తి